క్లుప్తంగా

సన్మానం



స్టేషన్ ఘన్‌పూర్: కంబోడియాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సిట్టింగ్ పారా త్రోబాల్ పోటీల్లో మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మాచర్ల కృష్ణవేణి ఉత్తమ ప్రతిభతో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. కాగా, శనివారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం నివాసంలో మాచర్ల కృష్ణవేణిని ఘనంగా సన్మానించి అభినందించారు. రైస్ మిల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్దె వెంకన్న, మార్కెట్ చైర్మన్ లావణ్య, షైరీస్ రెడ్డి,మంతెన ఇంద్రా రెడ్డి, మాచర్ల కుమార స్వామి, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన



జనగామ: జాతీయ నెట్ బాల్ టోర్నమెంట్‌లో అండర్– 14 విభాగంలో రాష్ట్ర టీంకు ఎంపికైన జనగామకు చెందిన మాల మహాసభ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాటికుమార్ కుమార్తె నిహారికను ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ శనివారం హైదరాబాద్‌లో సత్కరించి స్వీటు తినిపించారు. ఆటలతో పాటు చదువులో రాణించి తల్లిదండ్రులు పిల్లలపై పెట్టుకున్న నమ్మకం, జన్మనిచ్చిన ఊరికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్సీ.. నిహారికను ఆశీర్వదించారు. రాష్ట్రం తరపున నెట్ బాల్‌లో రాణించి, మన సత్తాచాటాలన్నారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

● రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాలరాజు

బచ్చన్నపేట: పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వేముల బాలరాజు అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో పద్మశాలీలు సత్తా చాటాలన్నారు. ఈ నెల 17న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి పద్మశాలీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి గజ్జల దామోదర్, జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి, చిల్పూర్ మండల అధ్యక్షుడు బండారి రాజ్‌కుమార్, యూత్ అధ్యక్షుడు పేరాల నాగభూషణం, కుమారస్వామి పాల్గొన్నారు.

ఎన్నిక



వీరోజి, అధ్యక్షుడు

రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా గాజులపాటి వీరోజి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సమావేశమై అధ్యక్షుడిగా వీరోజి, ఉపాధ్యక్షుడిగా పెండెల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా కాసం శ్యామ్‌సుందర్, కోశాధికారిగా పబ్బ వీరేషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వీరోజి మాట్లాడుతూ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు గొట్టం భాస్కర్‌రెడ్డి, గాజులపాటి మహేందర్, అక్కనపల్లి సత్యనారాయణ, ఎండి హయతలి, ఎండి షబ్బీర్, హింగె మోహన్, గొట్టం కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

జనగామ రూరల్: మండలంలోని సిద్దంకి గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 60 పశువులు రాగా వాటికి డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్ గర్భకోశ వ్యాధుల నిర్ధారణ చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ జైపాల్‌రెడ్డి గోపాలమిత్రులు ఎం.హరి సిహెచ్ నాగరాజ్, స్థానిక విజయ పాలకేంద్రం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, పాడి రైతులు పాల్గొన్నారు.

కురుమలు సంఘటితం కావాలి

బచ్చన్నపేట/రఘునాథపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా కురుమలు సంఘటితం కావాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు జూకంటి కిష్టయ్య అన్నారు. శనివారం మండల కేంద్రం నుంచి కోకాపేటలో నిర్మించిన తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ సంఘం భవనం ప్రారంభోత్సవానికి కురుమలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న కురుమలకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఎంటె శ్రీనివాస్, బియ్య అశోక్, తుప్పతి చెంద్రయ్య, పరిదె మల్లేష్, కరికె కర్ణాకర్, అయిలయ్య, లింగం, బాలరాజు, మల్లయ్య ఉన్నారు. అలాగే రఘునాథపల్లి మండలం నుంచి గొరిగ రవి, కొలుపుల రవి, పేర్నె రవి, పోకల శ్రీనివాస్, ద్యావర యాకన్న, గొరిగ భాస్కర్, బర్మ సత్తయ్య, చేవెల్లి వెంకన్న, నోముల సత్తయ్య, మైసయ్య తరలివెళ్లారు.

అందుబాటులోకి '108' సేవలు

● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



108 వాహనం వద్ద సిబ్బంది

చిల్పూరు: నూతనంగా చిల్పూరు మండలం ఏర్పడినప్పటి నుంచి 108 వాహనం అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గర్భిణులు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి 108 అంబులెన్స్ అందుబాటులో లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. అత్యవసర సమయంలో 108 వాహనం లేకపోవడంతో చాలా మంది ఆస్పత్రులకు వెళ్లేలోపు మరణించిన సందర్భాలు ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలు మార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రజలు మండలానికి 108 అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. కాగా, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన 108 వాహనాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండలంలోని మల్కాపూర్ పీహెచ్‌సీలో ప్రారంభించారు. దీంతో మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న 108 సేవలు అందుబాటులోకి రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కడియం కృషి ఫలితమే..



ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషి ఫలితంగానే మండలానికి 108 అంబులెన్స్ వచ్చింది. ఇప్పటి వరకు మండల ప్రజలు 108 సేవలకు నోచుకోలేదు. ప్రస్తుతం ఆ లోటు తీరింది.

– పోలేపల్లి రంజిత్‌రెడ్డి, స్థానికుడు

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నూతనంగా పీహెచ్‌సీకి మంజూరైన 108 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. చిన్నచిన్న సంఘటనలకు కాకుండా అత్యవసర సేవలకోసమే వినియోగించుకోవాలి.

– ఊరడి సతీష్, స్థానికుడు

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

● అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



జనగామ రూరల్: విద్యార్థులత కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

జనగామ రూరల్: విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పెంబర్తి ఎంజేపీ టీబీసీడబ్ల్యూఆర్ పాఠశాలలో ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చదువుతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం డైట్ మెనూ బోర్డును, హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గది, డైనింగ్ గది, మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనం స్టాక్ రికార్డులను తనిఖీ చేసి నాణ్యమైన రుచికరమైన ఆహారం విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. డీటీ రాజేశ్వర్‌రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

రఘునాథపల్లి: వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ ఎండీ మొహిన్స్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. వంట సామగ్రి, స్టోర్ రూం పరిశీలించారు. ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో భోజనం రుచికరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు కూడా పెరిగాయని తహసీల్దార్ పేర్కొన్నారు.

మెనూ ప్రకారం వడ్డించాలి

బచ్చన్నపేట: హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, టిఫిన్లను వడ్డించాలని నాయబ్ తహసీల్దార్ ఫణికిషోర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆయన పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.వార్డెన్ నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

'గోపా' జిల్లా కమిటీ ఏకగ్రీవం



ఆంజనేయులుగౌడ్, జిల్లా అధ్యక్షుడు



శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి



రాజాసంపత్‌గౌడ్, కోశాధికారి

జనగామ: గౌడ్స్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా) జిల్లా నూతన కమిటీని శనివారం జిల్లా కేంద్రంలోని కెమిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేకపోతుల ఆంజనేయులుగౌడ్, ప్రధాన కార్యదర్శి బైరగోని శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి దూడల రాజాసంపత్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా మాచర్ల ప్రభాకర్‌గౌడ్, గూడ రాజబోసుగౌడ్, బుడిగె కృష్ణమూర్తిగౌడ్, అంబటి అంజయ్యగౌడ్, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, కార్యదర్శులుగా దూరి ఉపేందర్‌గౌడ్, కొయ్యడ శ్రీరాంగౌడ్, మాచర్ల బాలరాజుగౌడ్, ఓడపల్లి అశోక్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా మాచర్ల చంద్రమౌళిగౌడ్, వి.వెంకన్నగౌడ్, కుర్రెముల మోహన్‌గౌడ్, తాళ్లపల్లి బాబుగౌడ్, కుర్ర సురేందర్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా తొలుపునూరి రామచంద్రంగౌడ్, బిక్కి రవీందర్‌గౌడ్, తోట మల్లేష్‌గౌడ్, వెలిశాల రాంనర్సయ్యగౌడ్, బత్తిని చొక్కయ్యగౌడ్, నర్మెట కృష్ణగౌడ్, గౌరవ సలహాదారులుగా తీగ సిద్ధిమల్లయ్యగౌడ్, అంబటి రాజయ్యగౌడ్, మాచర్ల రాములుగౌడ్, దూడల రమేష్‌గౌడ్, వగలబోయిన విజయ్‌కుమార్‌గౌడ్, మడిపల్లి అయిలయ్యగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు ఎంపికయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్రెముల యాదగిరి, చెక్కిళ్ల మధుసూదన్ గౌడ్, వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా పరశురాములుగౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

● మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

జనగామ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులకు గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంట రవీందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరాహార దీక్ష శనివారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. దీక్షకు రవీందర్ మద్దతు తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్షలో 18 సంవత్సరాలుగా వెట్టిచాకిరి చేస్తున్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అందేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. అలాగే వారికి ఉద్యోగ భద్రత కల్పించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, గణేష్, తాండూరి రమేశ్, బైరగోని దయాకర్, కొట్టె శ్రీలత, రమేశ్, వెంకటేశ్వర్లు, ఎండబట్ల శ్రీనివాస్, జ్ఞానానందం, సురేష్, యాదయ్య పాల్గొన్నారు.

చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: సమగ్ర శిక్ష ఉద్యోగులను చర్చలకి పిలిచి వారి సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు యాద శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడుతూ 18 సంవత్సరాలు విద్యాశాఖలో తక్కువ వేతనంపై పనిచేస్తున్న వారి న్యాయమైన కోరికలను ఆమోదించి సమ్మె విరమించేలా చేయాలన్నారు. శ్రీనివాస్, వెంకటయ్య, కొమురెల్లి, శ్రీధర్, భూపాల్, రాజేందర్ పాల్గొన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ ఘన విజయం



జనగామ రూరల్: రైల్వే మజ్దూర్ యూనియన్ ఘన విజయం సాధించిందని బ్రాంచ్ సెక్రటరీ దేవరాజు ఎలేందర్, చైర్మన్ తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు శనివారం జనగామ రైల్వే స్టేషన్ ఎదుట రైల్వే ఎంప్లాయిస్ అందరూ స్వీట్లు పంచి, టపాకాయలు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 4, 5, 6 తేదీల్లో జరిగిన సౌత్ సెంట్రల్ రైల్వే గుర్తింపు ఎన్నికల్లో రైల్వే ఎంప్లాయిస్ అంతా ఎర్రజెండాకి పట్టం కట్టారని చెప్పారు. ట్రెజరీ శ్రీశైలం, తిరుపతి యాదవ్, స్టేషన్‌మాస్టర్ కిరణ్, స్వర్ణలత, రాజ్యలక్ష్మి, బత్తుల కిరణ్, జోగు భాస్కర్, రమేష్, నర్సింగరావు, నరేష్, మల్లేష్, రాజు, రాజీవ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

పాలకుర్తి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందేలా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో కృషి చేసి సత్తా చాటాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నియోజవర్గంలోని దేవరుప్పుల, పాలకుర్తి మండలం ఎల్లరాయని తొర్రూరు, ఈరవెన్ను, శాతపురం గ్రామాల పరిధిలోని పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి అర్హులకు అందేలా చూడాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఎల్లరాయని తొర్రూరు సంఘం అధ్యక్షుడు మైసిరెడ్డి, పులి గణేష్, అనుముల మల్లారెడ్డి, బిర్రు సోమేశ్వర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వివాహానికి రూ.25 వేల సాయం

పాలకుర్తి టౌన్: నిరుపేద అంధుడు మారోజు శంకరాచారి కుమార్తె వివాహానికి కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి రూ.25 వేల సాయం అందజేశారు. శంకరాచారి ఇంటికి వెళ్లి పెళ్లి కూతురు అఖిలను ఆశీర్వదించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎడవెల్లి సోమమల్లయ్య శంకరాచారి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందించారు. నాయకులు కమ్మగాని నాగన్న, గంగు కృష్ణమూర్తి, వీరమానేని యాకంతరావు, పెనుగొండ రమేశ్ పాల్గొన్నారు.

కోతుల ఆకలి తీరుస్తున్న నరేశ్

● సత్కరించిన న్యాయవాదులు



నరేశ్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

జనగామ: అడవుల విస్తీర్ణం తగ్గిపోతుండడంతో వన్యప్రాణులకు ప్రాణసంకటంగా మారింది. ముఖ్యంగా వానరాలు కడుపు నింపుకునేందుకు జనావాసాల్లోకి వస్తున్నాయి. అయితే వాటి ఆకలి తీరుస్తున్న రంగాపురానికి చెందిన పల్లూరి నరేశ్‌ను శనివారం అంతర్జాతీయ కోతుల దినోత్సవం సందర్భంగా న్యాయవాదులు, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది మంచాల రవీందర్ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా నరేశ్ సేవలను కొనియాడారు. ప్రభుత్వం కోతులకు పునరావాస షెల్టర్లు ఏర్పాటు చేయాలని, అటవీ అధికారులు కోతుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. బార్ సోసియేషన్ అధ్యక్షుడు చంద్రఋషి, వెంకట్ నర్సయ్య, శ్రీహరి, రాంరెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చితే నష్టం



మండల కేంద్రంలో ఓ రైతు వరి పొలంలో కాల్చిన కొయ్యలు

లింగాలఘణపురం: వరి కోతకోసిన అనంతరం పొలంలో ఉన్న వరి కొయ్యలను రైతులు కాల్చకుండా ఆపడంలేదు. వ్యవసాయాధికారులు ఎంత చెప్పినా సులువుగా పని అయిపోతుందనే భావనతో రైతులు వరి కొయ్యలను కాల్చుతున్నారు. దీంతో భూమికి జరిగే నష్టం రైతులకు తెలియడంలేదు. దీర్ఘకాలికంగా భూమికి నష్టం జరిగి రాబోయే రోజుల్లో పంట దిగుబడి తగ్గుతుందనే విషయాన్ని రైతులు గ్రహించలేకపోతున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వరి కొయ్యలు కాల్చడంతో ప్రధానంగా భూమిలో సూక్ష్మజీవుల సమతుల్యత దెబ్బతినడం వల్ల భూసారం తగ్గుదన్నారు. దీర్ఘకాలంగా నేలలు చౌడుబారే ప్రమాదం ఉందని తెలియజేయడమే కాకుండా వాతావరణ కాలుష్యం కూడా ఏర్పడుతుందని చెప్పారు. రైతులు వరి కోసిన వెంటనే పొలాన్ని కలియదున్ని నీరుపెట్టి ఎకరానికి సింగిల్ సూపర్‌ఫాస్పేట్ 50 నుంచి 100 కిలోలు వేసుకోవడం వల్ల కొయ్యలు మురిగిపోయి భూసారం పెరుగుతుందని వివరించారు. రైతులు ముందుచూపు లేకుండా వరి కొయ్యలు కాల్చడంతో నష్టం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైన రైతులు వరి కొయ్యలు కాల్చొద్దని కోరారు.

నర్సరీ సందర్శన



అధికారులతో మాట్లాడుతున్న సఫిపుల్లా

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల నర్సరీ, పల్లెప్రకృతి వనం, వైకుంఠధామాలను శనివారం పీఆర్ఆర్‌డీ స్పెషల్ కమిషనర్, ఐఎఫ్ఎస్ సఫిపుల్లా సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీ నిర్వహణను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సీజన్‌లో లక్ష్యాలను చేరుకోవాలని అధికారులకు సూచించారు. ఆయనతో పాటు డీఆర్‌డీఏ వసంత, ఎంపీఓ రఘురామకృష్ణ, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ విగ్రహ యంత్ర ప్రతిష్ఠ



పట్టు వస్త్రాలతో ఆలయానికి వస్తున్న నరేష్‌కుమార్

బచ్చన్నపేట: మండలంలోని నారాయణపురంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో శివ పంచాయతన, సీతారామాంజనేయ, నవగ్రహ, ధ్వజస్తంభం విగ్రహాలకు యంత్రాలను ప్రతిష్ఠించారు. శనివారం వైదిక నిర్వాహకుడు పడిగెల కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో 30 మంది వేద బ్రాహ్మణుల సమక్షంలో పూజలు చేశారు. అనంతరం హోమ క్రతువు నిర్వహించి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. స్వామివారికి హైదరాబాద్‌కు చెందిన కేశబోయిన నరేష్‌కుమార్ పట్టువస్త్రాలను తీసుకొచ్చి సమర్పించారు. అలాగే రూ.11 లక్షల సాయం ఆలయానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



జనగామ: అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

జనగామ: జిల్లా కేంద్రం సిద్దిపేటరోడ్డు గోకుల్‌నగర్‌లో గుజ్జుల భవాని–శ్రీనివాస్ దంపతుల(గురుస్వామి) ఆధ్వర్యంలో శనివారం రాత్రి మహాపడిపూజ నిర్వహించారు. గురుస్వామి పుచ్చ నర్సింహమూర్తి, బాణాపురం అయ్యప్ప ఆలయ ప్రధాన పూజారి కాసోజు రాజేశ్వరాచార్యులు ప్రత్యక్ష పర్యవేక్షణలో పడిపూజ మహోత్సవం చేపట్టారు. వందలాదిగా తరలి వచ్చిన అయ్యప్పల శరణుఘోషలతో కాలనీలో భక్తి పారవశ్యం నెలకొంది. అయ్యప్ప స్వామిని తీరొక్క పూలతో అలంకరించి, రకరకాల పండ్లు, తేనె, చెక్కర, కుంకుమ, గంధం, పసుపు తదితర వాటితో అభిషేకాలు చేశారు. అయ్యప్పల హరహర ధ్వానాల నడుమ గురుస్వాములు 18 మెట్లపై పడి ముట్టించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, మాలధారులు గుజ్జుల నారాయణ, గుజ్జుల తుకారం, ఉమేష్, గాదె వెంకటేశ్వర్లు, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రణీత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని మారం శ్రీనివాస్ ఇంటి అవరణంలో అయ్యప్ప పడిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి దేవగిరి రామన్న పడిపూజ జరిపించారు. అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో రావడంతో భక్త జనసముద్రంగా మారింది. మాలధారులు పంచామృత అభిషేకం నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు సుమ



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ కోరారు. శనివారం పాఠశాలను ఆమె సందర్శించి మాట్లాడారు. పాఠశాల ఆవరణలో పందులు, కుక్కలు తిరుగుతున్నాయని, పాఠశాల వెనుకాల మురుగు నీరు నిలుస్తోందన్నారు. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. నాయకులు దండు మురళీకృష్ణ, మనోహర్, నాయకులు కీర్తన, నజీర్, స్నేహ, ఆర్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటాలు చేయాలి

● బీఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల ఐలన్న



మాట్లాడుతున్న ఐలన్న

స్టేషన్‌ఘన్‌పూర్: అసంఘటిత కార్మికులు హక్కుల సాధనకు పోరాటాలు చేయాలని బీఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల ఐలన్న పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రెండు రోజుల శిక్షణా తరగతుల్లో భాగంగా మొదటి రోజు సంఘం జెండా ఆవిష్కరించారు. అనంతరం 1996 చట్టం, ఆవిర్భావ విజయాలపై చర్చించారు. కార్యక్రమంలో సాయికుమార్, మధు, సంపత్, కుమారస్వామి, యాదగిరి, నరసింహులు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి



జనగామ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మూడు సంవత్సరాలుగా పని చేస్తున్న కానిస్టేబుల్ కొత్తపల్లి చిన్నారావు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు శనివారం డీసీపీ రాజ మహేంద్రనాయక్.. హెడ్ కానిస్టేబుల్‌కు పదోన్నతి పట్టీలను ధరింపజేశారు. 28 ఏళ్లుగా కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతి పొందడం ఆనందంగా ఉందని చిన్నారావు సంతోషం వ్యక్తం చేశారు. వరంగల్ సీపీ, డీసీపీకి ధన్యవాదాలు తెలియజేశారు.

'చలో హైదరాబాద్'కు తరలిరండి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ఈనెల 17వ తేదీన చలో హైదరాబాదుకు తరలి రావాలంటూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు కార్మికులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జీపీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు 6 నెలల నుంచి వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. అందుకు ప్రతీ కార్మికుడు కనీస వేతనాలు అమలు చేయాలనే డిమాండ్‌తో తరలిరావాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి కొడెపాక యాకయ్య, యూనియన్ నాయకులు బోసు రాజు, కుంభం రాజు, చింత వినయ్, సింగపురం అనీల్, ధర్మరాజు, బ్రహ్మం, సారయ్య, స్వరూప, కోమల, లక్ష్మి, కొమురమ్మ పాల్గొన్నారు.